క్లుప్తంగా

ఎల్‌వోసీ మంజూరు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పీర్ల అరవింద్ కుమార్తె అయాన్షి వినికిడి సమస్యతో బాధపడుతోంది. చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్‌లో చేర్చారు. శస్త్ర చికిత్స కోసం ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుండడంతో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన స్పందించి సీఎం సహాయ నిధి నుంచి రూ. 7.50 లక్షల ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్)ని మంజూరు చేయించారు. గురువారం ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి అందజేశారు. మంజూరుకు కృషి చేసిన సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

శివాజీకి ఘన నివాళులు

వేల్పూర్: రామన్నపేట్‌లో గురువారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి బాబూరావు, టి.నారాయణ, వినోద్, మాజీ ఉ ప సర్పంచ్ టి.చిన్నయ భూమేశ్వర్ పాల్గొన్నారు.

బోధన్ జిల్లా ఆస్పత్రి తనిఖీ

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని గురువారం డీసీహెచ్‌ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో వసతుల లేమిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఆస్పత్రిలో గైనిక్ వైద్యులు ఉన్నా డెలివరీల సంఖ్య పెరగడం లేదని.. నిజామాబాద్‌కు ఎందుకు రిఫర్ చేస్తున్నారని ప్రశ్నించారు.

మున్సిపల్ కమిషనర్‌కు ప్రశంస

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఆస్తిపన్నులు వసూలు చేయడంలో మున్సిపల్ కమిషనర్ రాజు జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసా పత్రం అందుకున్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో సుమారు 78 శాతం ఆస్తి పన్ను వసూలు చేశారు.

భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్‌కు..

మోర్తాడ్: హైదరాబాదులోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కార్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో రాష్ట్ర స్థాయిలో ఆస్తి పన్నుల్లో 77.63 శాతం వసూలు చేసినందుకు గాను భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారి శ్రీదేవి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్, ఆర్‌ఐ బండి రాజేశ్వర్, ఇతర సిబ్బందికి, పట్టణ ప్రజలకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై రాయితీ

బోధన్‌టౌన్(బోధన్): ఆస్తి పన్ను చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం 5 శాతం రాయితీ ఇస్తోందని ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ కోరారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన చేశారు. పట్టణంలోని ఇంటి, వ్యాపార సముదాయాల యజమానులు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తిగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1 నుంచి 30 తేదీలోపు ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఆస్తి పన్ను చెల్లించదలచిన వారు ఏరియా బిల్ కలెక్టర్‌కు చెల్లించి రసీదు పొందవచ్చని లేదా ఆన్‌లైన్‌లో చెల్లించే వారు emunicipal.telangana.gov.in వెబ్‌సైట్‌లో 10 అంకెల పిన్ నెంబర్‌ను నమోదు చేసి ఇంటి పన్ను చెల్లించాలని సూచించారు.

అయోధ్యకు పాదయాత్ర

రుద్రూర్: కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం వజ్రకండి గ్రామానికి చెందిన భక్తులు ఉత్తర్ ప్రదేశ్‌లోని అయోధ్యకు పాదయాత్రగా వెళుతున్నారు. ఈ పాదయాత్ర గురువారం రుద్రూర్ మండల కేంద్రానికి చేరుకుంది. స్థానిక విఠల్ గౌడ్ గృహంలో పాదయాత్రగా వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భజనలు, కీర్తనలు చేస్తూ జై శ్రీరామ్ నినాదాలతో వారు పాదయాత్ర చేస్తున్నారు.

కుస్తీ పోటీలు

వర్ని: చందూర్ మండలం ఘన్పూర్ గ్రామంలో విష్ణుమూర్తి స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఉదయం నుండి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేసి సాయంత్రం కుస్తీ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్



ఆర్మూర్ పట్టణంలో పాదయాత్ర చేస్తూ సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ నేత వినయ్‌రెడ్డి

భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన భారతదేశ నిర్మాణానికి అందరు కలిసికట్టుగా రావాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. పాదయాత్రగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. జాతిపిత బాపు(మహాత్మా గాంధీ) బోధించిన అహింస, శాంతి మార్గంలో పయనిద్దామని, రాజ్యాంగాన్ని రచించిన బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలతో ముందడుగు వేద్దామని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు. – సాక్షి నెట్‌వర్క్



భీమ్‌గల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నేత సునీల్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, తదితరులు



జాన్కంపేట్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి



ఎత్తొండలో ..



నందిపేట మండలం శాపూర్‌లో ..



కోకల్‌దాస్ తండాలో..

'ఇళ్ల పనులు త్వరగా ప్రారంభించాలి'

డొంకేశ్వర్(ఆర్మూర్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ సూచించారు. గురువారం గంగాసముందర్ గ్రామానికి వచ్చిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామంలో మొత్తం 35 మందికి ఇండ్లు మంజూరు కాగా, ఐదుగురు మాత్రమే ముందుకు వచ్చిన ముగ్గు పోసుకున్నారని, మిగతా వారు కూడా నెలాఖరు నాటికి మొదలుపెట్టాలన్నారు. పనులు ప్రారంభిస్తే ప్రభుత్వం నుంచి డబ్బులు త్వరగా ఇప్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. తహసీల్దార్ నరేశ్, పంచాయతీ కార్యదర్శి మోహన్ ఉన్నారు.

నిర్మాణంలో ఉన్న ఇళ్ల పరిశీలన

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని మల్లారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆర్డీవో రాజాగౌడ్ పరిశీలించారు. గ్రామంలో 23 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 6 బేస్‌మెంట్ లెవల్‌లో.. 4 పిల్లర్ల దశలో ఉన్నాయని, మిగతావి వారం రోజుల్లో ప్రారంభించాలని 45 రోజులలో పనులు ప్రారంభించకపోతే రద్దవుతాయని లబ్ధిదారులకు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ వసంతరావు ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి

రుద్రూర్: పోతంగల్ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానిక నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పోతంగల్ మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం స్థానిక నేతలు మాట్లాడుతూ.. పోతంగల్ బస్టాండ్‌కు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి ప్రయాణికులు అధిక సంఖ్యలో వస్తారని అన్నారు. బస్టాండ్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు అవస్థలు పడుతున్నారని, వెంటనే ఈ సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. భజరంగ్ హన్మాండ్లు, ప్రకాష్, లక్ష్మణ్, రమేష్, సాయులు తదితరులున్నారు.



వినతిపత్రం అందజేస్తున్న స్థానిక నాయకులు

దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులు



ఆలూర్‌లో నివాళులర్పిస్తున్న కుర్మ సంఘం సభ్యులు



మోస్రాలో ..

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో గురువారం కుర్మ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 99వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుర్మ సంఘం సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కొమురయ్య త్యాగం మరవలేనిదన్నారు.

మోస్రాలో..

వర్ని: మోస్రా మండల కేంద్రంలో అమరవీరుడు దొడ్డి కొమరయ్య జయంతిని కుర్మ సంఘం నాయకులు గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి, భుక్తి కోసం పోరాడిన మహాయోధుడని వారు కొనియాడారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నందిపేట్(ఆర్మూర్): ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌డీసీసీబీ అధ్యక్షుడు కుంట రమేష్ రెడ్డి అన్నారు. గురువారం అయిలాపూర్ సొసైటీ ఆధ్వర్యంలోని నందిపేట, అయిలాపూర్ గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ మీసాల సుదర్శన్‌తో కలిసి ప్రారంభించారు. డిప్యూటీ తహసీల్దార్ వసంతరావు, ఏవో జ్యోత్స్న భవాని, సొసైటీ కార్యదర్శి నరహరి, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్‌తో పాటు నికాల్‌పూర్, కోమట్‌పల్లి, ఎమ్మెడ, బాద్గుణ, అన్నారం, సిర్పూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. డొంకేశ్వర్‌లో కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ భరత్‌రాజ్ రెడ్డి ప్రారంభించారు. వైస్ చైర్మన్ మోర్తాడ్ ముత్యం, డైరెక్టర్లు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

మాక్లూర్: కొత్తపల్లితో పాటు పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ నేత పొద్దుటూరి వినయ్‌రెడ్డితో కలిసి మాక్లూర్ సొసైటీ చైర్మన్ బూరోల్ల అశోక్ ప్రారంభించారు. మాక్లూర్ విండో వైస్ చైర్మన్ గుండారం శేఖర్, మాజీ చైర్మన్ దయాకర్ రావు, రైతులు పాల్గొన్నారు.

వేల్పూర్: రామన్నపేట్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల ఏపీఎం మాణిక్యం గురువారం ప్రారంభించారు. సీసీ ప్రకాశ్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



నందిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ అధ్యక్షుడు కుంట రమేశ్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: కోనసముందర్, నర్సాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కోనసముందర్ సొసైటీ చైర్మన్ సామ బాపురెడ్డి ప్రాంభించారు. కోనాపూర్, ఇనాయత్‌నగర్, అమీర్‌నగర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ నర్సయ్య ప్రారంభించారు. ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్, సీఈవో నాగరాజు, కిషోర్, ఏఎంసీ డైరెక్టర్ జైడి మధులత తదితరులు పాల్గొన్నారు.



డొంకేశ్వర్‌లో .. చైర్మన్ భరత్‌రాజ్ రెడ్డి

మోర్తాడ్: భీమ్‌గల్ మండలం పల్లికొండ, మోర్తాడ్ మండలం వడ్యాట్‌లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్‌కుమార్, మోర్తాడ్ ఐకేపీ ఏపీఎం ప్రమీల, సీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రెంజల్(బోధన్): దూపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు రాములు, సాయరెడ్డి, ఏపీఎం చిన్నయ్య, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

నవీపేట: నవీపేట, నాగేపూర్‌లలో కొనుగోలు కేంద్రాలను నవీపేట, నాగేపూర్ సొసైటీల చైర్మన్లు న్యాలకంటి అబ్బన్న, శైలేష్‌కుమార్‌లు వేర్వేరుగా ప్రారంభించారు. అలాగే అంజుమాన్ ఫారమ్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం భూమేశ్వర్‌గౌడ్ ప్రారంభించారు.



కొత్తపల్లిలో .. చైర్మన్ బూరోల్ల అశోక్, కాంగ్రెస్ నేత వినయ్ రెడ్డి

ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ఎలక్షన్ అధికారులు సేరియల జగన్, కొత్తపల్లి రాములు ప్రకటించారు. నేటి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నామని, 7వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. 8న నామినేషన్ల సవరణ పూర్తి చేసి ఓటర్ లిస్ట్ విడుదల చేస్తామన్నారు. ఈనెల 9న సాయంత్రం 5 గంటల లోపు నామినేషన్ ఉపసంహరణలు స్వీకరించి, పోటీలో నిలిచిన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామన్నారు. 11న ఎన్నికలు నిర్వహించి, అదే రోజున ఓట్ల లెక్కింపు పూర్తి చేసి గెలుపొందిన అభ్యర్థుల వివరాలను వెల్లడిస్తామన్నారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య, మాజీ ఉపాధ్యక్షుడు పోడేటి శంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



షెడ్యూల్ విడుదల చేస్తున్న ఎన్నికల అధికారులు

పసుపు పరిశోధన స్థానం సందర్శన



పసుపు రకాల గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానాన్ని జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం కల్లూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం సందర్శించారు. పరిశోధనల గురించి విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. పసుపులోని కుర్కుమిన్ శాతం, పరీక్షించే విధానం, పసుపు రకాల గురించి విద్యార్థులకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ తెలియజేశారు. శాస్త్రవేత్త భాస్కర్, టీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హిందూ సంస్కృతి చాలా గొప్పది



మాట్లాడుతున్న గుమ్మల సత్యం

ఆర్మూర్‌టౌన్: ప్రపంచంలోనే మన హిందూ సంస్కృతి ఎంతో గొప్పదని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో విశ్వ హిందూ పరిషత్ ఆర్మూర్ శాఖ ఆధ్వర్యంలో సామాజిక సమరసత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమరసత భావన, శ్రీరాముని గుణగణాల గురించి వివరించారు. హిందూవులు ఐక్యం ఉండాలన్నారు. సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్టాల సుమన్, వీహెచ్‌పీ సభ్యులు తమ్మల కృష్ణ, గాజుల దయానంద్, అల్జాపూర్ అక్షయ్, తదితరులున్నారు.

అనుమతి లేకుండా ఆస్పత్రి నడిపితే కఠిన చర్యలు



తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

నందిపేట్(ఆర్మూర్): ప్రభుత్వ అనుమతి లేకుండా ఆస్పత్రులను నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిప్యూటీ అధికారి రమేశ్ హెచ్చరించారు. గురువారం నందిపేట పీహెచ్‌సీ పరిధిలోని ప్రయివేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టారు. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర వివరాలు పరిశీలించారు. తనిఖీలలో మండల వైద్యాధికారి ప్రవీణ్, సాయి, కృష్ణమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.

సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి గురువారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్టులో భాగంగా పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. దీంతో భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు సూర్య శ్రీకాంత్, ఆర్మూర్ నియోజకవర్గ కన్వీనర్ పాలెపు రాజు, ఎస్ఎంసీ చైర్మన్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువల్లో చెత్తను తొలగించండి



కాలువను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

బోధన్‌టౌన్(బోధన్): బెల్లాల్ చెరువు కింద గల తెజు, శర్బతీ కాలువలతో పాటు నిజాంసాగర్ డి–40 కాలువల్లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని తొలగించే చర్యలు చేపట్టాలని సబ్‌కలెక్టర్ వికాస్ నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. గురువారం అధికారులతో కలిసి పట్టణంలోని సాగునీటి కాలువలను పరిశీలించారు. కాలువల్లో చెత్తాచెదారం వల్ల బెల్లాల్ చెరువు ఆయకట్టు రైతులకు ఇబ్బందులు పడుతున్నారని, నీటి పారుదల శాఖ నిధులతో శుభ్రం చేయించాలని సూచించారు.

ఆధ్యాత్మికం

■ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మాక్లూర్: గుంజ్లి గ్రామంలో నిర్మించిన రామాలయంలో గురువారం పలుగుట్టకు చెందిన మంగిరాములు మహారాజ్, మాధవానంద సరస్వతిస్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా విగ్రహాలతో పాటు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ నేత పొద్దుటూరి వినయ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

■ సామూహిక కుంకుమార్చన

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలోని కండేరాయుడు మల్లన్న ఆలయంలో గురువారం స్పాట్ యూత్ ఆధ్వర్యంలో సామూహిక లలిత సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు, స్పాట్ యూత్ అసోసియేషన్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.



■ సీతారామచంద్రస్వామి శోభాయాత్ర



వేల్పూర్: పడగల్‌లో రామాలయం బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి సీతారామచంద్ర స్వామి శోభాయాత్ర నిర్వహించారు. స్వామివారిని రథంపై డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు.

■ హనుమాన్ స్వాముల భిక్షాటన

రెంజల్(బోధన్): మండల కేంద్రంలో గురువారం హన్మాన్ స్వాములు భిక్షాటన చేశారు. ఇంటింటికి తిరుగుతు నిత్యావసరాలను సేకరించారు. ప్రతి ఏడాది గ్రామంలో సేకరించిన నిత్యావసరాలతో శ్రీరామ నవమి రోజున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది.



సినిమాలు


పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 వృషభ–10.30, ఎల్‌వైఎఫ్–1.40, 28సీ–7.55, కోర్ట్–4.45, 10.25

స్క్రీన్-2 సికిందర్ (హిందీ) - 10.00, 1.00, 7.10, 10.10, రాబిన్‌హుడ్–4.00

స్క్రీన్-3 మ్యాడ్ స్క్వేర్–11.20, 2.05, 4.50, 7.35, 10.20

స్క్రీన్-4 కోర్ట్–10.10, రాబిన్‌హుడ్–1.15, 10.20 వీర–4.25, ఆదిత్య369–7.15



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,800	వెండి(కిలో)	1,04,000
22 క్యారెట్స్	83,805		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

చలివేంద్రం ప్రారంభం

వర్ని: సత్యనారాయణపురం గ్రామ పంచాయతీలో రెండు చలివేంద్రాలను వర్ని ఎంపీడీవో వెంకటేష్ గురువారం ప్రారంభించారు. వర్ని బస్టాండ్, పశువుల ఆస్పత్రి వద్ద చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఎంపీవో మారుతి, పంచాయతీ కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

కమ్మర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకుడు సారా సురేష్, మండలాధ్యక్షుడు బషిరి అశోక్ పిలుపునిచ్చారు. గురువారం నాగాపూర్‌లో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతు నాయకులపైన పెడుతున్న కేసులను కేంద్రం తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

స్థానిక సమస్యలను పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. సమస్యలపై ఆర్మూర్ మున్సిపల్ ఎదుట ధర్నా నిర్వహించి మున్సిపల్ మేనేజర్ హాయుమ్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం పార్టీ నాయకులు కుతాడి ఎల్లయ్య, నాగరాజు, సుజాత, నవీద్, రఫీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

8న అఖిల భారత నిరసన దినం పాటించాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని.. ఈనెల 8న అఖిల భారత నిరసన దినంగా పాటించాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి. ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. బీజేపీ మత రాజకీయాలను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. నిరసన దినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రామకృష్ణ, దేవారం, రమేష్, ముత్తెన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి సామాజిక సేవ చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులు విద్యార్థి దశ నుంచి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆర్మూర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణు ప్రసాద్ అన్నారు. ఆలూర్ మండలం గగ్గుపల్లిలో గురువారం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేక శిబిరాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. జీపీ కార్యదర్శి కిశోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం యూనిట్ ఆఫీసర్ యాదగిరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలకు ప్రమాద బీమా

రుద్రూర్: మండలంలోని బీజేపీ కార్యకర్తలకు గురువారం బాన్సువాడ నియోజకవర్గ నాయకుడు, ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ ఆధ్వర్యంలో పోస్టల్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించారు. ఈ సందర్భంగా శశాంక్ మాట్లాడుతూ.. కార్యకర్తల్లో మనోధైర్యం కల్పించి భరోసా కల్పించడానికే ఇన్సూరెన్స్ చేయిస్తున్నామని అన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పించాలనేది తన ఉద్దేశమని, ఇది నిరంతర ప్రక్రియగా పేర్కొన్నారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు ఆలపాటి హరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఏముల గజేందర్ పాల్గొన్నారు.



రసీదులను అందజేస్తున్న కోనేరు శశాంక్